జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com



బుధవారం | 6-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 664 పేజీలు: 4 వెల : రూ.7


# 16న సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన



* నరసన్నపేటలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి,
* అనంతరం అధికారులతో కలిసి సమీక్ష



**నరసన్నపేట, మే 5 (వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16వ తేదీన నరసన్నపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జమ్ము, అలాగే ఎస్వీఎల్ మిల్లు వద్ద చర్మాల చెరువు సమీపంలో బహిరంగ సభ నిర్వహణకు ప్రతిపాదించిన స్థలాలను వారు నిశితంగా తనిఖీ చేశారు. అలాగే, తామరాపల్లి వద్ద గతంలో ఉన్న హెలిపాడ్‌కు తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా పైడితల్లి అమ్మవారి ఆలయం సమీపంలోని 'చెత్త నుంచి సంపద' కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కంబకాయ రోడ్డులోని స్క్రాప్ దుకాణం, ప్రైవేటు ప్లాస్టిక్ గ్రేడింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కార్మికులతో ముచ్చటించి, వారి సమస్యలను, వారికి అందుతున్న వేతనాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నరసన్నపేట పట్టణం పరిశు



భ్రంగా కనిపించాలి. వీధుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పక్కా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేయగా, జాయింట్ కలెక్టర్ ఆయా శాఖలు పూర్తి చేయాల్సిన పనులపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎస్పీ డి. లక్ష్మణరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేశ్వర ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు.. హైవే!

* జాతీయ రహదారిలో నిత్యం ప్రమాదాలు
* నిబంధనలు పాటించని వాహనచోదకులు
* బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కోళ్ల వ్యాను
* ఇద్దరికి తీవ్ర గాయాలు







**మందస, మే 5(వార్త):** కొందరు వాహనచోదకులు నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్యం, అలసత్వం వెరసి జాతీయ రహదారిపై రోజుకో ప్రమాదం చోటుచేసుకుంటోంది. జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. మందస మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని జాతీయ రహదారిపై తలగాన శ్రీను, ధనలక్ష్మి అనే ఇరువురు సోంపేట నుంచి పలాస వైపు ద్విచక్రవాహనంపై వెళు తున్నారు. వెనుక వైపు నుంచి కోళ్ల లోడు వస్తున్న వ్యాన్ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. వ్యాన్ బలంగా ఢీకొనడంతో ద్విచక్రవాహనం వెనుక భాగం వ్యాన్‌లోకి వెళ్లిపోయింది. దీంతో వాహనంపై ప్రయాణిస్తున్న శ్రీను, ధనలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. సోంపేట 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను హరిపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు రిఫర్ చేయడంతో టెక్కలిలోని జిల్లా ఆసుపత్రికి మెరుగైన చికిత్సకు 108 అంబులెన్స్ తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాద సంఘటన చూపరులకు భయానికి గురిచేసింది.

## ఆటోను ఢీకొన్న లారీ

**సారవకోట:** సారవకోట మండలం వడ్డినవలస పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు అయింది. సారవకోట నుంచి వడ్డినవలస వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం తీవ్రతకు ఆటో బోల్తా పడిపోయి పూర్తిగా దెబ్బతింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికురాలు గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనలో ఆటోలో ఉన్న సామగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.



## మౌలిక సదుపాయాలతో గ్రామాల అభివృద్ధి



**కంచిలి, మే 5(వార్త):** కూటమి ప్రభుత్వంలో అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు అన్నారు.

అంపురం పంచాయతీ నరసన్న ముకుందపురంలో మంగళవారం 110 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి పలువురు కూటమి నాయకులతో కలిసి మంగళవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి పంచాయతీని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించి ప్రతి గ్రామానికి నిధులు మంజూరు అయ్యేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పురుషోత్తం, కిశోర్, రామారావు, పాలయ్య, కృష్ణ, కూర్మారావు, త్రినాథ్, సూర్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 12న హరిపురంలో శ్రీఅభయాంజనేయస్వామి జయంతి



**మందస, మే 5(వార్త):** హరిపురంలో ఈనెల 12న శ్రీఅభయాంజనేయ స్వామి జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్టు పూజా కమిటీ ప్రతినిధులు తెలి పారు. బాలిగాం జంక్షన్‌లో ఈ ఉత్సవాలు ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనా కాలక్షేపం, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి.. అభయాంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## కురడాలు గ్రామదేవతను దర్శించుకున్న దుదిష్టిపాత్రో



**మందస, మే 5(వార్త):** భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గ సభ్యుడు, బీజేపీ మందస మండల మాజీ మండల అధ్యక్షుడు, పొందర దుదిష్టి పాత్రో కురడాలు గ్రామదేవతను మంగళవారం దర్శించుకున్నారు. మందస మండలంలోని బుడారిసింగి పంచాయతీలో గల కురడాలు గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. గ్రామ కమిటీ ఆహ్వానం మేరకు దుదిష్టిపాత్రో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీజేపీ మందస పట్టణ అధ్యక్షుడు గౌడ హడ్డి, గ్రామపెద్దలు పాలక కైలాస్, ఎస్.కైలాస్, టి.బృందావన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి చట్టాలపై అవగాహన ఉండాలి

### -మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్



**మందస, మే 5(వార్త):** హరిపురం వైద్య సిబ్బందికి స్వరం మెడికల్ సెంటర్‌లో మంగళవారం ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవల్లో న్యాయపరమైన అవగాహన ఎంతో కీలకమన్నారు. రోగుల సేవలో భాగంగా మెడికల్ సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు, బాధ్యతలు, వైద్య సేవలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని సూచించారు. ముఖ్యంగా అత్యవసర సేవలు అందించే సమయంలో, పోలీసులతో సమన్వయం, కేసుల నమోదు, మెడికో-లీగల్ అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. రోగుల హక్కులు, వైద్యుల బాధ్యతలు, ప్రమాదాల సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలు, సాక్ష్యాల పరిరక్షణ వంటి అంశాలపై సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. న్యాయ అవగాహనతో పనిచేస్తే అనవసర సమస్యలను నివారించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, స్వరం మెడికల్ యజమాని గెద్దవలస రంజిత్, సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



**ఇచ్ఛాపురం, మే 5(వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మిక్కీ బెహరా, సోనాలి ప్రధాన్, రిద్ధినాయక్, కృష్ణ మహాపాత్రో, ఆదిత్య బెహరాను ప్రధానోపాధ్యా యులు ప్రమీల కుమారి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో ఇంకా ఉన్నతమైన స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. 10వ తరగతి పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం 20 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రవేశపెట్టిందని, ప్రతిరోజూ టైమ్ టేబుల్‌ను విద్యార్థులు పాటించేటట్లు చూసి, వారు పాస్ అయ్యేటట్లు శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్, నిలిప్‌కుమార్, దేవకీ దేవి, ఉప్పాడ పాపారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## చిన్నారి దీక్షిత కు రూ. 12 వేల సాయం

**సంతబొమ్మాళి, మే 5(వార్త):** టెక్కలి గ్రామానికి చెందిన చిన్నారి దీక్షితకు సీతానగరం గ్రామానికి చెందిన యూత్ ఆఫ్ యూనిటీ వారు మంగళవారం సహకారం అందించారు. దీక్షిత ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకుని చిన్నారి వైద్యం ఖర్చులకోసం సాయం చేసిన స్వచ్ఛంద సంస్థల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులకు యూత్ ఆఫ్ యూనిటీ సభ్యులు స్వయంగా రూ.12 వేలు అందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.



# కార్గో ఎయిర్‌పోర్టుతో ఉద్దానంలో విధ్వంసం

### -సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పవద్దు
### -ప్రజా సంఘాల డిమాండ్
### -కలెక్టరేట్ వద్ద నిరసన



**మందస/శ్రీకాకుళం, మే 5(వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ఉద్దానం విధ్వంసానికి పూనుకుంటున్నారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని పోలీసు నిర్బంధాన్ని ఎత్తివేయాలని, వేధింపులు ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద గల పూలే విగ్రహం వద్ద కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానం తీర ప్రాంతంలో లక్ష లాది మొక్కలు, చెట్లు ఉన్నాయని, ఇవి ప్రకృతి వైపరీత్యాలు, సునామీల నుంచి జిల్లాను కాపాడుతున్నాయన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో లక్షలాది జీడి, మామిడి, కొబ్బరి, మునగ తదితర చెట్లు నరకడంతో వాటిపై ఆధారపడి తరతరాలుగా జీవిస్తున్న వేలాది మందికి ముప్పు ఏర్పడుతుందన్నారు. మరో వైపు జిల్లాకు పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంద్ర మంత్రి రామ్మో హన్‌నాయుడుకి తెలియదా అని ప్రశ్నించారు. మూడుసార్లు ఎంపీగా, ఒకసారి కేంద్రమంత్రిగా ఉన్న రామ్మోహన్ నాయుడు ఈ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల కోసం ఒక్క పైసా అయినా ఎందుకు తేలేదని ప్రశ్నించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఇచ్ఛాపురం శివారు భూముల వరకు నీరందిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. ప్రజల ఆదాయాలు పెరుగుతాయని వ్యవసాయ ఆధార పరిశ్రమలు వస్తాయని, ఉపాధి దొరుకుతుందని వలసలు నివారించబడతాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఎందుకు నిధులు కేటాయించ డంలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వైపు అణు విద్యుత్ కేంద్రం, మరో వైపు థర్మల్ పవర్ ప్లాంట్, ఇంకొక వైపున కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ప్రజల భూముల్ని కార్పొరేట్లకు అప్పజెప్పడమే అభివృద్ధా? జిల్లాపై ఎందుకు యుద్ధం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల భూములను కార్పొరేట్లకు అప్పజెప్పే హక్కు మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ గ్రామాల్లో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగంతో ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో జీడికి గిట్టుబాటు ధర ఇస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు హామీని అమలు చేయ లేదన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరించారు. జూన్ 6తన చలో ఉద్దానం కార్యక్రమం చేపట్టి రాంపురంలో ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతాడ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, పౌర హక్కుల సంఘం నాయకుడు పత్రి దానేషు, ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పొందూరు చంద్రరావు, పోలాకి ప్రసాదరావు, కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, మహిళా సంఘం నాయకులు పి.కుసుమ, బాలకృష్ణ, అరుణోదయ కళాకారులు రామా రావు బృందం పాల్గొని సంఘీభావం తెలిపారు. ఐఎఫ్టీయూ నాయకుడు జుత్తు వీరస్వామి, తులసయ్య, కూన రాము, నీలంరాజు, కృష్ణవేణి, గణేష్, కూర్మా రావు తదితరులు పాల్గొన్నారు.





## రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలతో మేలు

### -టీడీపీ మందస మండల అధ్యక్షుడు దుర్యోధన



**మందస, మే 5(వార్త):** రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలతో భూయజమానులకు మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. మందస మండలంలో పిడిమండస పంచాయతీ సవరమధ్య గ్రామంలో భూయాజమాన్యపు హక్కు, పట్టాదారు పాసు పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్యోధన, కూటమి నాయకులు మాట్లాడుతూ వారసత్వంగా సంక్రమించిన ఆస్తులను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇబ్బంది పెట్టకుండా ఏ నాయకుడు ఫొటో లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తన పాలనలో రీ సర్వే పేరుతో మొత్తం రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి మరల పట్టాదారు పాస్ పుస్తకాలను తన ఫొటోలు ప్రతీ పేజీలో ముద్రించి వైసీపీ రంగులతో కూడిన పాసు పుస్తకాలను ఇచ్చారన్నారు. దీంతో రైతుల్లో చాలా అభద్రతా భావం కలిగి, ఆందోళన ఏర్పడిందన్నారు. వీటిని మధ్యలో ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి అవకాశం ఉంటుందని భయపడ్డారన్నారు. గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చిన మేరకు ఆ పాసు పుస్తకాలు రద్దు చేశారన్నారు. యడం ఇప్పుడు భూ రికార్డులను సరిచేస్తూ రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను మీ చెంతకు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, వీఆర్వో కృష్ణమూర్తి, టీడీపీ మండల కార్యదర్శి సాలిన మాధవరావు, ముంజేటి చంద్రశేఖర్, సవర చంద్రశేఖర్, అగ్గున జయరాజు, సవర ఆనంద్, సవర వాసు, పంచాయతీ సెక్రటరీ కల్పన, వెల్ఫేర్ అసిస్టెంట్ మహేశ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12న మందసలో అంజనీదేవి విగ్రహస్థాపన



**మందస, మే 5(వార్త):** మందసలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 12న శ్రీఅంజనీదేవి విగ్రహస్థాపన, ఆవిష్కరణ వైభవోపేతంగా నిర్వహిస్తామని శ్రీఅభయాంజనేయ పూజా కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు 19వ వార్షికోత్సవం కూడా నిర్వహిస్తామన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6గంటలకు క్షీరాభిషేకం, 8గంటలకు విఘ్నేశ్వర పూజ, 9 గంటలకు మండప ఆవాహనం జరుపుతామన్నారు. ఉదయం 9.30గంటల నుంచి అంజనీదేవిమాత విగ్రహంతో వాసుదేవపెరుమాళ్ ఆలయం నుంచి అభయాంజనేయస్వామి ఆలయం వరకు తిరువీధి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు తీసుకుని, అంజనీదేవి, అభయాంజనేయస్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సానా గణేశ్(విఘ్నశం), బి.జగన్నాథరావు(పండా) పిలుపునిచ్చారు.



## చిన్న వర్షానికే రోడ్డంతా మురుగుమయం!



### - దుర్వాసనలో సోంపేట మెయిన్ రోడ్డు
### - పంచాయతీ తీరుపై విమర్శలు

**సోంపేట, మే 5(వార్త):** సోంపేటలో చిన్న వర్షం పడినా కాలువలోని మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహించే పరిస్థితి తరచూ నెలకొంటోంది. మెయిన్ రోడ్‌లోని గీతా మందిర్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ఈ సమస్యతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దీంతో పంచాయతీ అధికారులు, పాలకుల తీరుపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించడంలో గ్రామ పంచాయతీ ఘోరంగా విఫలమవుతుందంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు, వర్షపు నీరు సక్రమంగా ప్రవహించేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. అక్కడ భవన నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడం, కాలువను ఆక్రమించి ఇళ్లు, షాపులు కట్టేయడంతో సక్రమంగా వెళ్లాల్సిన మురుగునీరు వర్షాకాలంలో నేరుగా మెయిన్ రోడ్డు పైకి రావడం ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారుతుంది. ఇటు వంటి అడ్డంకులు సృష్టించిన వారిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో విచ్చలవిడిగా నిర్మాణాలు సాగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థాని కులు విమర్శిస్తున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించే సందర్భంలో పక్క నుంచి వెళ్లే వాహనాలతో ఆ నీరు మనుషులపై తుళ్లి తీవ్ర సమస్యగా మారు తుంది. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించి ప్రజ లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సోంపేట ప్రజలు కోరుతున్నారు.

## ఏపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**శ్రీకాకుళం, మే 5(వార్త):** ఏపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎంపికైంది. నూతన కౌన్సిల్ సమావేశం శ్రీకాకుళంలోని హోటల్ గ్రాండ్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుక్కూరు వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవాధ్యక్షుడిగా టెంక చలపతిరావు, అదనపు కార్యదర్శిగా పి.బాలాజీరావు ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా అనంతాచార్యులు, ఉపాధ్యక్షుడిగా వైవీ రమణ, బీవీఎన్ జితేంద్ర, బి.నవీన్, బి.ధర్మారావు, కార్య దర్శులుగా వి.శ్రీనివాసరావు, బి.చిన్నారావు, సీహెచ్ కిరణ్‌కుమార్, టి.జోగా రావు, బి.కృష్ణారావు, ఎం.రమణారావును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్ని కల అధికారులుగా ఈశ్వరరావు, మధుసూదనరావు వ్యవహరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

### తీర్మానాలివే..

12వ పీఆర్సీ అమలు చేయాలని, ఐఆర్ 30% ప్రకటించాలని, పాత బకాయిలు చెల్లించాలని, పది రోల్ దాటిన పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయు లను కేటాయించాలని, మూడేళ్లకొకసారి రేషనలైజేషన్ చేయాలని తీర్మా నించారు. ఎస్ఎస్‌సీలో శత శాతం ఫలితాలు సాధించిన పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో హాజరు కావాలని కోరడం సరైనది కాదన్నారు. సప్లిమెంటరీ రాస్తున్న విద్యార్థులు ఉన్న పాఠశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఈఎల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, ఎస్జీటీలకు పీఎస్‌హెచ్ఎం ప్రమోషన్ చానల్ ఇవ్వాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జేసీఐ ఆధ్వర్యంలో..
# సెల్యూట్ ది సైలెంట్ స్టార్స్

**ఇచ్ఛాపురం, మే 5(వార్త):** జేసీఐ ఆధ్వర్యంలో వి.జె. గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో "సెల్యూట్ ది సైలెంట్ స్టార్స్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జేసీ బోయినా శ్రవణ్ ప్రజలకు కనిపించకుండా నిశ్శబ్దంగా సేవలందిస్తున్న "సైలెంట్ స్టార్స్"ను అభినందించి ప్రోత్సహించారు. వారు సమాజానికి అందిస్తున్న విశేష సేవలను ప్రశంసిస్తూ, వారి కర్తవ్య నిబద్ధతకు గౌరవంగా సెల్యూట్ చేశారు. సమాజానికి అద్భుతమైన సేవలందిస్తున్న ఫైర్ డిపార్ట్‌మెంట్, సిహెచ్‌సి , ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బందిని ఘనంగా సత్కరించింది. కార్యక్రమానికి జోన్ 4 అధ్యక్షుడు ఆర్‌పీపీ చైతన్య వసంతవాడ ముఖ్య అతిథిగా, జెడ్‌విపి హెచ్‌జిఎఫ్ ఈశ్వర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం అధ్యక్షుడు జేసీ బోయినా శ్రవణ్, కార్యదర్శి డా. సంతోష్ సహు, ప్రాజెక్ట్ చైర్మన్ డా.వేచా సంతోష్, ఎం.స్వరూప్, షన్ముఖ్, కాళ్ల జైదేవ్, పి. దినేష్, పి. స్నిగ్ధ, కే. మల్లేష్, ధర్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ముంజులా... మజాకా!

**- డజన్ రూ.60 నుంచి 80లు**

**- వేసవిలో విపరీతమైన గిరాకీ**

**సోంపేట, మే 5(వార్త):** వేసవి వచ్చిందంటే అందరూ తాటి ముంజులు తినడానికి ఎంతో ఇష్టపడతారు. రుచితో పాటు శరీరానికి ఎంతో చలువ చేస్తా యని అందరూ ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం వేడెక్కిన వేసవిలో ఒకవైపు రుచితో పాటు మరోవైపు దాహార్తిని తగ్గించే తాటి ముంజుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు వాటి ధరలు షాక్ ఇస్తున్నాయి. మార్కెట్లోనూ వీధుల్లోనూ విక్రయించేవారు డజను ముంజులు 60 నుంచి 80 రూపాయలకు విక్రయిస్తు న్నారు. దీంతో పేద వర్గాలు తాటి ముంజులకు నోచుకోవడం లేదు. గతంలా మాదిరిగా తాటి చెట్ల పైకి ఎక్కి తాటికాయలు కొట్టి వాటి లోపల ముంజులు సేకరించే పనివారు తగ్గిపోవడంతో మార్కెట్లో ముంజుల విక్రయం కూడా తగ్గినట్లుగా తెలుస్తుంది. కవిటి, కంచిలి మండలాల ఉద్దానం ప్రాంతం నుంచి తాటిముంజలు అధికంగా సేకరించి కంచిలి సోంపేట మార్కెట్లకు తీసుకు వస్తారు. కవిటి మండలం జాడపూడి జంక్షన్ వద్దకు తెచ్చే తాటి ముంజలను ఒడిస్సాకు చెందిన వారు కొనుగోలు చేసి ఆయా ప్రాంతాలకు తరలిస్తారు. ఈ వ్యాపారంతో కొంత మందికి ఈ వేసవిలో ఉపాధి లభిస్తుంది.



## తమిళనాట దళపతి విజయ్ కొత్త అధ్యాయం

**-వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**



**పలాస, మే 5(వార్త):** హీరో అంటే విజయ్ లాగా ఉండాలని, తమిళ నాట దళపతి విజయ్ కొత్త అధ్యాయం లిఖించారని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజల ఆకాంక్షలను లోతుగా అర్థం చేసుకుని, వారి విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సమర్థ వంతమైన పాలన అందించాలని ఆయన ఆకాంక్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్న విజయ్‌కు శుభా కాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేసి తన స్టార్ ఇమేజ్‌ని విజయ్ నిరూపించుకున్నారన్నారు. తన సత్తా చాటుకున్నాడని చెప్పారు. ఆయనకు నమ్ముకున్న అభిమానులకు, క్యాడర్ కు నేడు భరోసా లభించిం దన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పరిపాలనతో తమిళనాడు రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, విద్యారంగ బలోపేతం, ఆరోగ్య సేవల మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామీణ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయ సాధనలో విజయ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ముందడుగు వేయాలని బమ్మిడి దుర్యోధనరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నరసన్నపేటలో పారిశుధ్య పనులు వేగవంతం



**నరసన్నపేట, మే 5(వార్త):** ఈ నెల 16న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నరసన్నపేట పట్టణంలో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి. పట్టణాన్ని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మంగళవారం ఆధునిక యంత్రాలతో మెయిన్ రోడ్డును చెత్త లేకుండా శుభ్రం చేశారు. అలాగే డంపింగ్ యార్డులో సుమారు 50 మంది కార్మికులతో తడి, పొడి చెత్తను వేరు చేసి తొలగించారు. కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా పట్టణాన్ని సిద్ధం చేయడంపై అధికారులు దృష్టి సారించారు.





## హెల్మెట్‌ను ధరిస్తేనే
# ప్రాణాలకు రక్షణ

**-అభయం ప్రోగ్రాంను ప్రారంభించిన కాశీబుగ్గ డీఎస్పీ**

**పలాస, మే 5(వార్త):** హెల్మెట్‌ను ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ కలుగుతుందని కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని అన్నారు. కాశీబుగ్గలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీను ప్రారంభించారు. హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కాశీబుగ్గ పట్టణంలో అభయం హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని మూడు రోడ్లు కూడలి వద్ద అభయం హెల్మెట్ బ్యాంక్ ప్రారంభించి వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. ఈ ర్యాలీ కాశీబుగ్గ పట్టణంలోని మూడు రోడ్లు కూడలి నుండి ప్రారంభమై కె టి రోడ్డు మీదుగా ఇంద్ర చౌక్ వరకు సాగింది. అనంతరం అక్కడి నుండి మూడురోడ్లు కూడలి వరకు తిరిగి ర్యాలీ నిర్వహించి ప్రజల్లో హెల్మెట్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ టి. భవాని, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది స్వయంగా హెల్మెట్ ధరించి వాహనం నడుపుతూ హెల్మెట్ ప్రాముఖ్యత, అవసరం ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీగా సాగారు. మూడురోడ్లు కూడలిలో ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్ ద్వారా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు తాత్కాలికంగా హెల్మెట్లు అందజేసి, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ రక్షణ ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే ప్రధాన ఉద్దేశంతో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి అభయం హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమాన్ని శ్రీకాకుళం పట్టణంలో తొలి దశగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాశీబుగ్గ-పలాస పట్టణంలో అభయం హెల్మెట్ ర్యాలీ నిర్వహించిన్నట్లు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందిని అన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలి. ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అత్యవసర చర్య అని తెలిపారు. ప్రజలంతా హెల్మెట్ ధారణను అలవాటు చేసుకుని, రోడ్డు భద్రతకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ అవగాహన ర్యాలీలో కాశీబుగ్గ టౌన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ వై రామకృష్ణ, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతి రావు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ

**జలుమూరు, మే 5(వార్త):** భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కుంటూ రైతులకు భరోసా కల్పించే దిశగా జలుమూరు మండలం అక్కురాడ గ్రామంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ నూతనంగా జారీ చేసిన పాస్ పుస్తకాలను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గతంలో భూముల హద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల చిన్నపాటి తగాదాలు చోటుచేసుకున్నాయని, వాటికి పరిష్కారం చూపేందుకు రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే చేపడుతున్నామని వివరించారు. కొత్తగా జారీ చేసే పాస్ పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్రతో పాటు రైతు ఫోటో, భూమి వివరాలు స్పష్టంగా ఉంటాయని తెలిపారు. రైతుల హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, భూములపై పూర్తి హక్కులు రైతులకు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, తహశీల్దార్, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేంద్రీయ విద్యాలయం వద్ద ..
# మినీ స్టేడియం నిర్మించాలి

**పలాస, మే 5(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో క్రీడాకారుల సౌకర్యార్థం కేంద్రీయ విద్యాలయం (కేంద్రియ విద్యాలయం) సమీపంలో మినీ స్టేడియం నిర్మించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పలాస డిప్యూటీ తాహశీల్దార్ గిరికు వినతిపత్రం అందజేశారు. గతంలో కోల్ ఇండియా వారి సీఎస్ఆర్ నిధులతో మినీ స్టేడియం నిర్మాణానికి సుదికొండ (హుద్‌హుద్ ఇళ్ల వద్ద) 1.5 ఎకరాల స్థలాన్ని కేటాయించారని నేతలు గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం నిర్మిస్తున్న ప్రాంతానికి ఆనుకుని ఉన్న సుమారు 1.5 ఎకరాల స్థలం స్టేడియానికి ఎంతో అనువుగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. క్రీడాకారులకు మేలు జరుగుతుందని, ఆ పక్కనే క్రీడా మైదానం ఉండటం వల్ల అటు విద్యార్థులకు, ఇటు స్థానిక యువతకు శారీరక దృఢత్వానికి, క్రీడల్లో రాణించడానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పలాస పట్టణంలో సరైన మైదానం లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే స్థల మార్పిడిపై నిర్ణయం తీసుకుని పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, లోడగల కామేష్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, ఎం నరేంద్ర (చిన్ని), కొరికన శంకర్రావు, సవర రాంబాబు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.



## అవలింగిలో ఘటాల పండగలు

**- అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**సారవకోట, మే 5(వార్త):** అవలింగి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ చెవిటిమ్మ తల్లి గ్రామదేవత ఘటాల పండగలు సందర్భంగా నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామస్థుల ఆహ్వానం మేరకు పలు ఇళ్లను సందర్శించి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికారి ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, సారవకోట పిఎసిఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, వైస్ చైర్మన్ పొదిలాపు వేణుగోపాలరావు, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


## ఒండ్రుజోల పంచాయతీలో
## ఐటీడీఏ పీవో స్వప్నిల్ పర్యటన

**కొత్తూరు, మే 5 (వార్త):** ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్వప్నిల్ పవర్ జగన్నాథ్ మంగళవారం ఒండ్రుజోల గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామ ప్రజలతో మాట మంతి కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలను విన్నారు. గుమడా-కుంచాలపేట రోడ్డు నిర్మాణం, ఒండ్రుజోల బద్ది చెరువు సుందరీకరణ, పులిపుట్టి రెవెన్యూ గ్రామ భూసమస్యలు, ఒండ్రుజోల రెవెన్యూ ఇనాం భూసమస్యల గురించి ప్రజలు తెలిపారు. అలాగే, కారిగూడ గ్రామస్తులు మినీ జీసీసీ డిపో కోరినా, మంజూరు చేస్తానని అధికారి హామీ ఇచ్చారు. గ్రామం మొత్తం పరిశీలించి, అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవల్పర్స్ అధినేత బామిడి రాజు, మెట్టూరు బిట్-3 మాజీ సర్పంచ్ కోయిలపు శ్రీనివాస్ రావు, నీటి సంఘం అధ్యక్షుడు బామిడి సుందరి నారాయణలతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## పలాస ప్రభుత్వ ఐటీఐలో 7న జాబ్ మేళా

**పలాస, మే 5 (వార్త):** డా.వి.కణితీష్ ప్రభుత్వ ఐటీఐ, పలాసలో ఈనెల 7న జాబ్ మేళా నిర్వహించబడునని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు అయిన సుంద్రం ఫాస్టెనర్స్ లిమిటెడ్, బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆంఫెనాల్ అపోలో టైర్స్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్, ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, టిహెచ్‌కె, హ్యుందాయ్ మోబిస్ (కియా మోటార్స్), ఇండోమిమ్, ఐల్ డిక్సన్, రిన్యూస్సిస్, స్త్రైక్వాడ్ ఎలక్ట్రానిక్స్ వారు అభ్యర్ధులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారని కళాశాల ప్రిన్సిపల్ పైల జవహర్, వి రఘురాం (డిడివో), కె రవి కుమార్(డిటివో), బి వి ఆర్ కిషోర్ (ఏడి టి వో) తెలిపారు. ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 30 సంవత్సరాల అభ్యర్ధులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్ధులు తమ రెజ్యూమ్, ఆధార్ కార్డు, అర్హత సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావలసిందిగా కోరడమైనది. ఆసక్తి గల అభ్యర్ధులు మరిన్ని వివరాల కోసం 6301046329ను సంప్రదించగలరు. అభ్యర్ధులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు.



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | TVS Sundaram Fasteners Limited | SUNDARAM FASTENERS LIMITED | TECHNICIAN | ITI /(PASS / FAIL) | MALE(18 TO 25 YEARS) | Rs.17567/-+ SUBSIDISED FOOD Rs.2/- | 50 |
| 2 | TSF Brakes India | BRAKES INDIA PRIVATE LIMITED | TRAINEE | ITI(Any Stream) | MALE(2023, 2024, 2025, 2026) | Rs.15050+Rs1500/- Attendance Incentive+Rs.16550/- other allowances+Transport+Subsidised Food | 50 |
| 3 | Amphenol | AMPHENOL | MACHINE OPERATOR | ITI | MALE/FEMALE (18 TO 35 YEARS) | SALARY- Rs 15,000/- AFTER 6 MONTHS Rs.18,000/- +FOOD+ACCOMIDATION ALLOWANCES Rs.2000/ +TRANSPORT | 50 |
| 4 | apollo TYRES | APOLLO TYRES LTD | TRAINEE | ITI | MALE/FEMALE (18 TO 23 YEARS)(HT 5 ABOVE,WT 50 ABOVE | Rs.15,500/- TO Rs.17,000/- (ATTENDENCE BONUS Rs.1000/- TORs.1100/-+REWARD BONUS Rs.7500/- TO Rs.12500/- ONCE IN SIX MONTHS +SUBSIDIZED FOOD+TRANSPORT+3 MONTHS ACCOMIDATION | 50 |
| 5 | ISUZU | ISUZU MOTORS LTD | TECHNICIAN | ITI (EXCEPT CIVIL) | MALE/FEMALE(BELOW 25 YEARS) | Rs.13,500/-+ATTENDENCE INCENTIVE(S)FREE FOOD ON DUTY ONLY+TRANSPORTATION(14 DAYS ACCOMMODATION)AFTER SIX MONTHS SPECIAL ALLOWANCE Rs.12,000/- | 50 |
| 6 | | INDUS COFFEE PVT. LTD. | TECINICIAN/OPERATOR | ITI | MALE/FEMALE(18 TO BELOW 30 YEARS) | RS 15,500/-PF + ESI FREE FOOD ON DUTY HOURS + TRANSPORTATION | 50 |
| 7 | THK | THK | TRAINEE | ITI | MALE (BELOW 27 YEARS) | RS.15,000/-+ NAPS RS.1500/- + FOOD+TRANSPORT | 50 |
| 8 | HYUNDAI MOBIS | HYUNDAI MOBIS ( KIA MOTORS ) | TECHNICIAN | ITI | MALE (BELOW 23 YEARS) | RS.15,000/- (Rs.12,200/- +Rs.1000/- SKILL REWARD).BONUS RS.2000/- )+FOOD+TRANSPORT | 50 |

# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

### -అధికారులతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమీక్ష

**నరసన్నపేట, మే 5(వార్త):** ఈ నెల 16న నరసన్నపేటలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమగ్రంగా పరిశీలించారు. పర్యటనలో భాగంగా హెలిప్యాడ్, గ్రామసభ నిర్వహణ స్థలాలు మరియు ఇతర అవసరమైన వసతులను ఆయన పరిశీలించారు. అలాగే పట్టణంలో ఏర్పాటు చేసిన "చెత్త నుండి సంపద" కేంద్రాన్ని సందర్శించి అక్కడి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామసభలో ప్రజల సమస్యలను సక్రమంగా స్వీకరించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చెత్త నుండి సంపద కేంద్రం వంటి కార్యక్రమాలు ప్రభుత్వ అభివృద్ధి దిశను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్డీవోతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ శాఖల ఏర్పాట్లపై వివరాలు అందించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు.



## నరసన్నపేటలో నేడు విద్యుత్ అంతరాయం



**నరసన్నపేట, మే 5(వార్త):** నరసన్నపేట పట్టణంలో బుధవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి రామ్ చరణ్ గుప్తా తెలిపారు. పనుల నిర్వహణలో భాగంగా ఎమ్మార్వో కార్యాలయం పరిసరాలు, నేతాజీ వీధి, దేశవానిపేట, శివనగర్ కాలనీ, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఈ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అవసరమైన మరమ్మతు పనులు చేపట్టేందుకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## బొరివంక కాళీమాత సేవలో 'వెంకటరావు' కుటుంబం

### -మొక్కులు తీర్చుకున్న 'గుసిరి'



**మందస, మే 5(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నేత, మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు కుటుంబంతో సహా బొరివంక కాళీమాతను దర్శించుకున్నారు. మందస మండలంలోని బహడపల్లి, మూలిపాడు గ్రామాల నుంచి భక్తులు బొరివంక కాళికమ్మ సేవలో తరించారు. యాదవ సామాజికవర్గం నాయకునిగా గుర్తింపు పొందిన వెంకటరావు, సరస్వతి, కుమారులు హర్షవర్ధన్, చైతన్య, సార దూర్వాసులు, లక్ష్మి కుమార్తె, కుమారుడు గాయత్రి, సిద్ధార్థ, గుసిరి నాగేశ్వరరావు దంపతులు, వల్లభరావు దంపతులు, మద్దిలి మోహనరావు, శేషమ్మ దంపతులతో పాటు సుమారు 50మంది భక్తులు కాళికమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో ఆలయ సంప్రదాయాలతో కాళీమాతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉద్దానం ఇలవేల్పుగా ప్రసిద్ధి పొందిన కాళీమాత దర్శనం, సేవ, మొక్కులు తీర్చుకోవడం మధురానుభూతిని మిగిల్చిందని వెంకటరావు, సరస్వతీ దంపతులు తెలిపారు. కాగా.. ఇదే రోజు వెంకటరావు దంపతులు వివాహ వార్షికోత్సవం, సరస్వతి పుట్టిన రోజు కావడంతో కాళీమాత దర్శనం అనంతరం వెంకటరావు కాళికమ్మ తీర్థ ప్రసాదాలను తీసుకువచ్చి.. గ్రామాల్లో పంచిపెట్టారు. ఈ ప్రాంతీయులు ప్రత్యేకంగా బొరివంక కాళీమాత దర్శనానికి వెళ్లి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ వస్తోంది.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

### -అడ్మిషన్లపై ప్రత్యేక డ్రైవ్



**జలుమూరు, మే 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన అందిస్తూ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కల్పిస్తున్నామని ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు తెలిపారు. సోమవారం జలుమూరు మండలం శ్రీముఖలింగం ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో అడ్మిషన్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలు, బోధన విధానాల గురించి వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డ్రైవ్‌కు మంచి స్పందన లభించగా, మూడు కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

## పోలాకి పోలీసులకు హెల్మెట్ల పంపిణీ

### - రోడ్డు భద్రతపై సీఐ సూచనలు

**పోలాకి, మే 5 (వార్త):** పోలాకి పోలీస్ స్టేషన్ సిబ్బందికి సీఐ శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం హెల్మెట్లను అందజేశారు. ఐఎస్ఐ ప్రమాణాలతో ఉన్న నాణ్యమైన హెల్మెట్లను అందరూ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ వినియోగం కీలకమని తెలిపారు. పోలీసులు ముందుగా హెల్మెట్లు ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలాకి ఎస్సై రంజిత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఘన సత్కారం

**సారవకోట, మే 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే దిశగా సారవకోట మండలంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో రామన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేసి అభినందించారు. పది మంది విద్యార్థులకు నగదు బహుమతులు, ఇరవై మందికి మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కృషి చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కోన వెంకటేష్, మాజీ సర్పంచులు కోనారి సింహాచలం, గొంటి లక్ష్మణ్, పిఎసిఎస్ డైరెక్టర్ సంపతిరావు మురళీధర్ రావు, డీఈవో, ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదకరం

### - మడపాం టోల్‌ప్లాజా వద్ద శక్తి టీం అవగాహన




**నరసన్నపేట, మే 5(వార్త):** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం ప్రమాదకరమని టెక్కలి డివిజన్ శక్తి టీంకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్ పేర్కొన్నారు. మంగళవారం నరసన్నపేట మండలం మడపాం టోల్ ప్లాజా వద్ద శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. బాలబాలికలకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని, ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, స్థానికులు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు.

## ముగిసిన భద్రమహంకాళి గ్రామ దేవత సంబరాలు



**శ్రీకాకుళం, మే 5 (వార్త):** నగరంలోని ఇల్లీసుపురంలో మంగళవారం భద్రమహంకాళి అమ్మవారి గ్రామదేవత అనుపు పండుగలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ ఊరేగింపులో తప్పెటగుళ్లు, కోలాటం, డప్పు విన్యాసాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుమారు 5వేల మంది భక్తులతో ఘనంగా అమ్మవారి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. భక్తులు ముర్రాటలతో ఊరేగింపులో పాల్గొన్నారు. భద్రమ్మ తల్లిని ప్రత్యేక రథంపై ఉంచి ఊరేగించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



## సెలవుల్లోనూ విద్యార్థులపై శ్రద్ధ

### - టెక్కలిపాడు ఉపాధ్యాయుల ప్రత్యేక చర్యలు

**జలుమూరు, మే 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించినప్పటికీ విద్యార్థుల అభ్యాసంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జలుమూరు మండలం టెక్కలిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ముందడుగు వేస్తున్నారు. మంగళవారం ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకుని విద్యార్థుల హోంవర్క్‌లను పరిశీలించారు.

సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం కోసం సెలవుల్లో కూడా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. పాఠశాలకు రాలేని విద్యార్థుల వద్దకు స్వయంగా వెళ్లి పాఠ్యాంశాలపై సూచనలు, సలహాలు అందిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల నిరంతర అభ్యాసం కోసం ఉపాధ్యాయులు తీసుకుంటున్న ఈ చర్యలపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546